క్లుప్తంగా

ప్రారంభమైన 108 రోజుల హనుమత్ దీక్షలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్ష పీఠంలో స్వామి వారి 108 రోజుల దీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అభయ వీరాంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, తమలపాకులతో పూజలను పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమాలను నిర్వహించారు. 16వ తేదీ హైదరాబాద్‌లోని ఆశ్రమంలో 108 రోజుల దీక్షలు ప్రారంభమవుతాయని స్వామిజీ పేర్కొన్నారు. అనంతరం స్వామి వారి మూలవిరాట్‌కు పంచ హారతుల సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): సైబర్ క్రైమ్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ నిపుణుడు గౌరీ శంకర్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో యూత్ సర్వీసెస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం డ్రగ్ అబ్యూస్, సైబర్ క్రైమ్ అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరీశంకర్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ అంటే ఏమిటి, మనం ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకున్నప్పుడు 1930 నంబర్‌కి కాల్ చేయడం, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి సోషల్ మీడియా మాధ్యమాలకి రెండు వెరిఫికేషన్ కోడ్‌లు పెట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రిలోని డి అడిక్షన్ సెంటర్ ఆఫీసర్ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి వై. శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

యూత్‌ను ఆకట్టుకునే 'సిద్ధార్థ రాయ్'



లబ్బీపేట(విజయవాడతూర్పు): అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా సిద్ధార్థ రాయ్ చిత్రం ఉంటుందని ఆ చిత్ర హీరో దీపక్ సరోజ్ అన్నారు. ఈ నెల 23న విడుదల కానున్న సినిమా ప్రమోషన్‌లో భాగంగా గురువారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా బెంజిసర్కిల్ సమీపంలోని జేడీ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో దీపక్ సరోజ్ మాట్లాడుతూ సిద్ధార్థ రాయ్ చిత్రాన్ని దర్శకుడు యశస్వీ అద్భుతంగా తీశారన్నారు. అర్జున్ రెడ్డి తరహాలో ఈ చిత్రం ఉండబోతుందన్నారు. అనంతరం హీరోయిన్స్ తన్వినేగి, కల్యాణి మాట్లాడుతూ అర్జున్ రెడ్డి చిత్రానికి సంగీతం అందించిన రతన్ సిద్ధార్థ రాయ్ చిత్రానికి సంగీతం అందించారని తెలిపారు. ప్రతి సీన్ ఒక ఎమోషనల్‌గా సాగుతుందని ప్రేక్షకులు ఈ చిత్రాన్ని థియేటర్లో వీక్షించి ఆదరించాలని కోరారు.

29న వారాహి సహిత శత చండీ కదళీ యాగం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తాడిగడప వంద అడుగుల రోడ్డులోని అనుమోలు గార్డెన్స్ నందు ఈ నెల 29న వారాహి సహిత శత చండీ కదళీ యాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దూళిపూడి సరోజ రమేష్ తెలిపారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో యాగం బ్రోచర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 28న అమ్మవారి శోభయాత్ర, 29న వారాహి హోమం, మార్చి ఒకటిన చండీ హోమం, 2న కదళీ హోమం, లక్ష తమలపాకులు, లక్ష అరటిపండ్లతో పూర్ణాహుతి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాలలో అతిథులుగా మహిమాన్విత పీఠాధిపతులు వాసు స్వామి, మహా రుద్ర స్వామి, శివ స్వామి, యోగానంద భారతి స్వామి పాల్గొంటారని తెలిపారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్
- 37, 38 డివిజన్లలో గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమం



వ్యాపార వర్గాలను కలిసి మద్దతు కోరుతున్న ఆసిఫ్, చిత్రంలో మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన యావత్ దేశానికే ఆదర్శమని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ ఆధ్వర్యంలో గడపగడపకు మన ఆసిఫ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక డివిజన్‌లో ఆసిఫ్ మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి పర్యటించి వ్యాపార వర్గాలను కలిసి మద్దతు పలకాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ విజయవాడలోని మూడు నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

జనసేన, బీజేపీ, టీడీపీ కూటమిగా ఉన్న ప్రభుత్వం ఆలయాలను, మసీదులను, చర్చిలను కూలగొట్టిందన్నారు. అన్ని వర్గాల ప్రజల మనోభావాలను దెబ్బతీశాయన్నారు. సుమారు ఆరు వందల హామీలిచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ఒక్క హామీని సైతం నిలబెట్టుకున్న పాపాన పోలేదన్నారు. మళ్లీ నేడు ప్రజల ముందుకు ఏ ముఖం పెట్టుకొని వస్తారని ఆయన ప్రశ్నించారు. పాతబస్తీలోని చిట్టూరి కాంప్లెక్స్ నుంచి ప్రారంభమైన పర్యటన పులిపాటి వారి వీధి, భావనారాయణవీధి తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీల, కార్పొరేటర్లు ఇర్ఫాన్, గుడివాడ నరేంద్ర, చైతన్యరెడ్డి, మాజీ ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శరత్, నగర అధ్యక్షుడు బుదాల శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

విలువలు, విశ్వసనీయతకు ప్రతీక సీఎం జగనన్న

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాజకీయాల్లో విలువలు, ఇచ్చిన మాటకు కట్టుబడి 99 శాతం హామీలను నెరవేర్చి విశ్వసనీయతకు ప్రతీకగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమంలో భాగంగా 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా ఆధ్వర్యంలో ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ శ్రేణులతో కలిసి డివిజన్ పరిధిలో గురువారం విస్తృతంగా పర్యటించారు. ఏవైనా సమస్యలను ఎదుర్కొంటున్నారా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. అర్హత ఉండి సాంకేతిక కారణాల వలన పథకాలు అందని పక్షంలో వాటిని సరిదిద్ది తిరిగి దరఖాస్తు చేయించాలని సచివాలయ సిబ్బందికి చెప్పారు. కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, ఎండీ ఇర్ఫాన్, యలకల చలపతిరావు, గుడివాడ నరేంద్ర రాఘవ, పి. చైతన్యరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, పాత శివాలయం చైర్మన్ బొమ్ము మధు, పార్టీ నాయకులు ఎస్‌కే నజీర్, బీఆర్ఎల్ గౌస్, విజయ్, మంటి రాము, జి. వినోద్ పాల్, కటన్ కరిముల్లా, బి. శాంతి, అబ్దుల్ రవూఫ్, ఎస్‌కే అనీస్, దాదాభాయ్, బూదాల శ్రీను, బట్టిపాటి శివ పాల్గొన్నారు.

కోమలవిలాస్ సెంటర్ పేరు మార్పు



బోర్డును ఆవిష్కరిస్తున్న ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేటలోని కోమలవిలాస్ సెంటర్‌కు కార్మిక నేత కొరగంజి శేఖర్‌బాబు సెంటర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బోర్డును నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ గురువారం జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికనేతగా, వామపక్షనేతగా శేఖర్‌బాబు ఈ ప్రాంతానికి సేవలందించారని కొనియాడారు. ఆయన పేరును స్మరించుకోవటానికి వీలుగా కోమలవిలాస్ సెంటర్‌కు శేఖర్‌బాబు పేరును పెట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, శ్రీశైలం దేవస్థానం సభ్యుడు గురుమహంతు మహేష్, నాయకులు అత్తులూరి పెదబాబు, పిళ్లా రవి, శీరం వెంకట్రావు, మజ్జి శ్రీను, దేరంగుల రమణ, విశ్వనాథ రవి, కొరగంజి దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార వర్గాలకు అండగా ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



ఆసిఫ్‌ను సత్కరిస్తున్న కృష్ణవేణి మార్కెట్ పాలకవర్గం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో వ్యాపార వర్గాలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ పాలకవర్గాన్ని ఆ సంఘ కార్యాలయంలో గురువారం ఆసిఫ్ కలిసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గ అధ్యక్షుడు బచ్చు వెంకటప్రసాద్ ఇతర ప్రముఖులు ఆసిఫ్‌కు స్వాగతం పలికి పాలకవర్గ కార్యాలయంలోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ తాను గతంలో ఈ డివిజన్ కార్పొరేటర్‌గా పని చేసిన సమయాన్ని గుర్తు చేశారు. అలాగే వస్త్రలతతో పాటుగా కృష్ణవేణి మార్కెట్ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి అండగా ఉన్న విషయాన్ని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న తీరును వివరించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వ్యాపార, కార్మిక వర్గాలన్ని అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అధ్యక్షుడు బచ్చు వెంకటప్రసాద్‌తో పాటుగా వల్లంకొండ వీరముని బ్రహ్మనందరావు, గొంట్లా కృష్ణమూర్తి, వల్లంకొండ సూర్యశేషసత్యవరప్రసాద్, వోలేటి సుబ్రహ్మణ్యం, ఆత్మకూరి నాగవెంకటహనుమంతరావు, గ్రంధి రామసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన



మధురానగర్(విజయవాడసెంట్రల్): భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్తల కృషి వల్ల మనదేశం ఎన్నో విజయాలు సాధించిందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ రిటైర్డ్ శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో గురువారం రాకెట్లు, భారతీయ అంతరిక్ష పరిశోధనపై అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉపగ్రహాలు, ఉపగ్రహనౌకలు, వాటి తయారీ, పనితీరు, అంతరిక్షరంగంలో భారతీయ శాస్త్రవేత్తల విజయాలను ఆసక్తికరంగా నమూనాలు, పటాల సాయంతో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ విద్యార్థులలో అవగాహన పెంపొందించేందుకు అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేశామన్నారు.

శృతిలయ సమ్మేళనం.. వీణావాద్య సమ్మోహనం



త్యాగరాజ స్వామి పంచరత్న కృతులను వీణపై పలికిస్తున్న సంగీత విద్వాంసులు

విజయవాడ కల్చరల్: సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో గురువారం నిర్వహించిన అఖండ వీణా సంగీత సమ్మేళనం శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు త్యాగరాజ స్వామి రచించిన కృతులను వీణపై పలికించారు. కార్యక్రమంలో వీణా విద్వాంసులు కేఎస్ గోవిందరాజన్, అయ్యగారి సత్యప్రసాద్, చిట్టా కార్తీక్, కొండా శశిధర్, శిష్టు గౌరీ శంకర శాస్త్రి, ఈమని మహతి, చింతలపాటి ప్రజవి, రావూరి గాయత్రి, లక్ష్మీ వైష్ణవి పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై నిర్విరామంగా 12 గంటల సేపు సాగింది. కార్యక్రమాలను డాక్టర్ వై. రాఘవేంద్రరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి పూర్వవైభవం తీసుకురావాలని అందుకు కృషి చేస్తున్న సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి వారి కృషిని అభినందించారు. సంస్థ కార్యదర్శి సీవీరావ్ సంస్థ లక్ష్యాలను వివరించారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కబేళా విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ కామకోటినగర్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ టీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జోజినగర్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, లేబర్‌కాలనీ, కేసీ పబ్లిక్ స్కూల్ రోడ్, టీవీ కృష్ణారావు వీధి, ఆర్‌కే పబ్లిక్ స్కూల్ రోడ్, మానవ మందిరం రోడ్, నాగయ్య హోటల్ సెంటర్ తదితర ప్రాంతాలలో కరెంట్ నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సాంకేతిక రంగంపై అవగాహన అవసరం



పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో లయోల అధ్యాపకులు

గుణదల (విజయవాడ తూర్పు): ఆధునిక సాంకేతిక ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని చెన్నైలోని బోద్ బ్రిడ్జి సంస్థ సీఈఓ కొండవీటి బాలరాజు అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో టెక్నికల్ ఫెస్ట్ సైన్టియా – 2024 కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సాంకేతికలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని తెలిపారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం ఇలా అన్ని రంగాలలో సాంకేతికత సరికొత్త విధానాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు సాంకేతిక పరమైన కరెంట్ అఫైర్స్‌పై దృష్టి సారించి ఆలోచనలకు పదును పెట్టాలని కోరారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, కోడింగ్, డీబగ్గింగ్, మిస్టర్ సైన్టియా, మిస్ సైన్టియా, వంటి అంశాలలో పోటీలు నిర్వహించారు.

గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్ కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అపర్ణ, అధ్యాపకులు ఫాదర్ రాయప్ప, సహాయభాస్కరన్ పాల్గొన్నారు.

విదేశీ విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన

గుణదల (విజయవాడ తూర్పు): ఇతర దేశాలలో ఉన్న విద్యా, ఉద్యోగ అవకాశాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు పరిశీలనాత్మకంగా గమనిస్తుండాలని అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ రిక్రూట్‌మెంట్ మేనేజర్ సైలా బాల హేంబ్రామ్ అన్నారు. ఆంధ్ర లయోల ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో విదేశీ విద్య ఉద్యోగాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగాలలో స్థిరపడే దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జోజిరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, ప్రిన్సిపాల్ ఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల భవనం సిద్ధం



రాణిగారితోటలో ప్రారంభానికి సిద్ధమైన కమ్యూనిటీ హాల్ భవనం

- 18వ డివిజన్‌లో ముస్తాభైన కమ్యూనిటీ హాలు
- రూ.1.20కోట్లతో సకల హంగులు
- నేడు ప్రారంభించనున్న మేయర్ భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోట, 18వ డివిజన్ ప్రజల చిరకాల వాంఛ అయిన కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చేతుల మీదుగా కమ్యూనిటీ హాల్‌ను లాంఛనంగా ప్రారంభించనున్నారు.

అవస్థలకు చెక్..

పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివసించే రాణిగారితోట ప్రాంతంలో శుభకార్యాలు చేసుకునేందుకు కల్యాణ మండపాలు లేక స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్‌లో లక్షలాది రూపాయలు వెచ్చించి శుభకార్యాలు చేసుకోలేక ఇళ్ల ముందు ఇరుకు రోడ్లపైనే కొనసాగిస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా గత ప్రభుత్వం హయాంలో ఆర్‌సీఎం స్కూల్ పక్కనే ఉన్న మల్లెల తిరుపతమ్మ కూరగాయల మార్కెట్‌ను తొలగించి ఆ ప్రదేశంలో రెండంతస్తుల కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాన్ని ప్రారంభించి వదిలేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నగర అభివృద్ధిలో భాగంగా అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులపై దృష్టి సారించింది. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చొరవతో వీఎంసీ నుంచి నిధులు మంజూరు చేయించారు. దీంతో గ్రౌండ్‌ఫ్లోర్‌లో మిగిలిపోయిన పనులకు, మొదటి అంతస్తు నిర్మాణ పనులకు రూ.90లక్షలు.. ప్రహరీ, టాయిలెట్స్, పార్కింగ్ టైల్స్ నిర్మాణానికి రూ.30 లక్షలు నిధులు వచ్చాయి. కమ్యూనిటీ హాల్ భవనంలో గ్రౌండ్‌ఫ్లోర్ భోజనాలు ఏర్పాటుకు, మొదటి అంతస్తు శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా పెద్ద హాల్, భవనం చుట్టూ వాహనాల పార్కింగ్ సదుపాయం, వధూవరులకు వేర్వేరుగా రెండు రూమ్‌లు ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ ఈ నిర్మాణంపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయడంలో కృషి చేశారు.

నేత్రాల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



నేత్ర పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేత్రాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి. లక్ష్మణస్వామి అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణస్వామి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేత్రాలను నిర్లక్ష్యం చేస్తే చాలా మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. సరైన ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. విజయవాడ విన్ విజన్ ఐ హాస్పిటల్స్ డాక్టర్ నిశాంత్ జనార్దన్ రాజ్ మాట్లాడుతూ నేత్రాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు అభినందన

మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్ బాల్ పోటీలలో తృతీయ స్థానంలో నిలిచిన ఎస్ఆర్ఆర్ క్రీడాకారులను గురువారం కళాశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించటం ఆనందంగా ఉందన్నారు. ఈనెల 12, 13వ తేదీలలో జరిగిన అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ పురుషుల విభాగంలో తమ కళాశాల విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచి సత్తాచాటారన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత అత్యుత్తమ ప్రదర్శనతో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులను సత్కరించారు. కళాశాల వ్యాయామ విద్యా విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీ శాక్స్ ల్యాబ్ టెక్నీషియన్ కుటుంబానికి రూ.లక్ష సాయం



నగదు అందిస్తున్న రాజేంద్ర కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ శాక్స్‌లో బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన ప్రదీప్ కుమార్ కుటుంబానికి గురువారం గొల్లపూడిలోని ఏపీ శాక్స్ కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎస్.బి.రాజేంద్రకుమార్ లఖింశెట్టి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఏపీ శాక్స్ ల్యాబ్ టెక్నీషియన్ అండ్ ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్–124) నుంచి లక్ష రూపాయలను సేకరించారు. కార్యక్రమంలో ఏపీ శాక్స్ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ కామేశ్వర ప్రసాద్, జాయింట్ డైరెక్టర్ మంజులాదేవి, సుకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.దేవచంద్ర ప్రసాద్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ డి.సుబ్బారావు, రాష్ట్ర అదనపు కోశాధికారి బి.వెంకటేష్ బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కళా సంస్థలు కళాకారులకు వేదిక కల్పించాలి



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల ప్రదర్శనకు వేదిక కల్పించాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం మెరిసే మేఘమాలిక పేరుతో సినీ సంగీత విభావరి, గుంటూరుకు చెందిన కళాంజలి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తొట్టెంపూడి రమేష్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు తమ సంస్థ నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. మహిళా జ్యోతిష్యశాస్త్రవేత్త ప్రసూనా రామన్, చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు. నిర్వాహకులు తొట్టెంపూడి రమేష్‌ను ఆత్మీయంగా సత్కరించారు. అనంతరం పలువురు గాయకులు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వార్లకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవం జరిపించారు. పెద్ద సంఖ్యలో ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ఆర్థిక ఒడిదొడుకులు ఎదురుకాకుండా, పెళ్లి కానివారికి వివాహ యోగం, సంతానం లేని వారికి సంతాన భాగ్యం కలుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న ఉభయదాతలను ప్రత్యేక క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతించారు. కళావేదిక నుంచి ఉత్సవమూర్తులతో ఊరేగింపు నిర్వహించగా, పలువురు భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు.